వాన వెలసిన రాత్రి

దుర్గయ్యగారి జీవితంలో మరుపురాని ఘట్టాలు చాలా ఉన్నాయి. అవి రకరకాలు। అవన్నీ ఆయన మేధస్సులో చోటు చేసుకుని మనస్సును వేధించ సాగాయి.

పార్వతి ఆయనభార్య!

రహమాన్ కొడుకు।

ఉద్యోగం ఉపాధ్యాయవృత్తి।

తోడునీడలేని బ్రతుకు ఆయనిది.

అన్నీ సమస్యలే! అన్నిటినీ ఎదుర్కో కలిగాడు! ఇన్నిటికి తోడు మేరీ క్రొత్తగా వచ్చింది।

దుర్గయ్యగారు తన జీవితాన్ని పర్యాలోకన చేసుకుంటూ కూర్చున్నాడు. అసుర సంధ్యవేళ ఎందుకో ఆలోచన ప్రారంభమైంది ఆయనలో। నాటి నుండి తేరుకునేంతలో ఊరు మాటుమణిగి, కారు మబ్బులు అలుముకుని వాన కూడ ప్రారంభమైంది.

జల్లు వచ్చి ఇంట్లో పడుతున్నది। లేచి వెళ్లి తలుపుకు గడియపెట్టి వచ్చాడు. ఇంతవరకు దీపం వెలిగించలేదన్న సంగతి జ్ఞాపకంవచ్చి, అరవయ్యేళ్ల దుర్గయ్యగారు క్షణం నవ్వుకుని తన ఆలోచనలకు, దీపం వెలిగించారు.

మేరీ చాపమీద నిద్రపోతున్నది! అన్నం పెట్టమని మేరీ అడగలేదు. అడిగిందేమో, ఆయనకు జ్ఞాపకంలేదు.

మంచంమీద గుడ్డలు దులిపి, మేరీని ఎత్తుకుని, మంచంమీద పడుకోబెట్టాడు।

'అమ్మ' అని ఆ మూడేళ్ల మేరీ పెదవులు అస్పష్టంగా ఉచ్చరించాయి!

మేరీ ఆ యింటి కొచ్చి కొద్ది రోజులే అయింది. ఆవేళ వాన కురుస్తోంది ధారాపాతంగా! గాలి కూడా తీవ్రంగా ఉంది. అన్నం తిని భగవద్గీత ముందేసుకుని చదువుకుంటున్నాడు. పొద్దెంతపోయిందో తెలియదు. అస్పష్టంగా తలుపు కొట్టిన శబ్దమైతే, గాలివల్లేమో అని మొదట అనుకున్నాడు! కానీ కాదని తెలిశాక, లేచి వెళ్లి తలుపు తీశాడు.

ముద్దగా తడిసిన ఓ స్త్రీ చిన్న పాపను భుజాన వేసుకుని, వణుకుతూ లోపలికొచ్చింది. తలుపు గడియపెట్టిన దుర్గయ్యగారు ఆమెను చూసి క్షణం ఆశ్చర్యపోయినారు.

ఆమే అంతే! చంకలోని పిల్ల మాత్రం ఏడుస్తున్నది చలికి గాబోలు!

"నువ్వా!?........" అని మాత్రం అన్నాయి దుర్గయ్యగారి పెదవులు!

"మీరింకా యిక్కడే ఉన్నారని తెలిసి రాలేదు. వానా, గాలీ; పిల్ల ఏడుస్తూంటే ఈరాత్రికి తల దాచుకుందామని వచ్చా! అంతే!"

దుర్గయ్యగారు మరేం మాట్లాడలా। పొడిగుడ్డ లిచ్చి, పొయ్యి రాజేసి, పాలు కాచి యిచ్చాడు! ఆ పాలు పిల్లకు పట్టింది.

'మరి నువ్వో?' దుర్గయ్యగారి ప్రశ్నకు ఆమె అలవోకగా నవ్వి, "ఏమీ అఖ్కర్లేదు! ఈ రాత్రికి తలదాచుకోనిచ్చారు; అంతేచాలు. మిమ్మల్ని బాధ పెట్టటం యిష్టంలేదు.' అంది.

దుర్గయ్యగారి గొంతులో మాటలు గడ్డకట్టుకుపోయినయ్! మరి మాట్లాడక, పుస్తకంలోకి చూస్తూ కూర్చుండిపోయారు. ఆమె మాత్రం కొంగు పరుచుకుని, పిల్ల ప్రక్కను పడుకుంది.

ఆమె మాత్రం మర్నాడు కనుచీకట్లోనే వెళ్లబోయింది! దుర్గయ్యగారే పోనియ్యలేదు.

దుర్గయ్యగారు ఆ రాత్రి నిద్రకు దూరంగానే ఉన్నారని ఆమె గ్రహించ గలిగింది. "నా గురించే ఆలోచించారా! తెల్లవార్లూ?" అని అడిగింది.

"అవును!"

తెల్లారేసరికి వాన తగ్గింది కానీ, దాని బీభత్సమంతా చూసి పోనియ్యలేదు దుర్గయ్యగారు ఆమెను. వాగులూ, వంతలూ, పొలాలూ అన్నీ నీటిలో దాక్కుండిపోయినాయి. కనుచూపుమేరలో అంతా నీటిమయం. అందుకనే పోనియ్యలేదు.

"ఎప్పటికైనా పోవాల్సిందాన్నేగా! వెళ్లనివ్వండి!"

"నా ముందర, నా యింట్లో కొద్దికాలం ఉండటం కూడా బాధగా ఉందా నీకు?" అని ప్రశ్నించారు దుర్గయ్యగారు. "పైగా రాత్రికూడా ఏమీ తినలే దన్న సంగతి మర్చిపోకు. ఇలా నిన్ను పోనివ్వటం నాకు మనస్కరించదని నీకు తెలిసి కూడ పోతానంటే నే చెప్పేదేమీ లేదు!" అని కూడ అన్నారు.

ఆమె ఆలోచనలతో సతమతమయింది కాసేపు. ఇంతలో పాపకూడ నిద్ర లేచింది. మారు మాటాడక ఆమె అలాగే ఉండిపోయింది.

దుర్గయ్యగారు త్వరగా స్నానం, సంధ్య ముగించి. "నే బజారు వెళ్లి, తినటాని కేమన్నా తెస్తాను" అని వెళ్ళిపొయ్యారు వీధిలోకి సరాసరి. ఊళ్లో హోటలుకెళ్లి, ఇడ్లీలు కట్టించుకుని, కాఫీ చెంబులో పోయించుకుని వచ్చారు.

"మిమ్మల్ని శ్రమ పెట్టటం జరుగుతున్నది." అన్నదామె, అవన్నీచూసి.

దుర్గయ్యగారి కళ్లలో నీళ్లు తిరిగినయ్. ఆమె మాటలకు తమాయించు

కున్నారు. "అన్నీ తెలిసికూడ నా మనసును కష్టపెట్టకు. నా కీ జీవితాన ఇంతే వ్రాసిపెట్టి ఉంది. అందుకు నాకు చింత లేదు!" అని అన్నారు.

ఆయన యిచ్చిన పొట్లాలు అందుకుని. పిల్లకు తినిపించి ఆమె ఊరు కున్నది.

"మరి నువ్వు......"

"శనివారం, ఏమీ తినను."

"ఇంకా, ఆ నియమం వదిల్లేదా?

"వదల్లేనేమో! మిమ్మల్ని వదలగలిగాను కానీ, మీ సాహచర్యంలోని అలవాట్లు వదల్లేకపోతున్నా!

"అందుకు ఇప్పుడు బాధపడుతున్నావా?" ఆయన ప్రశ్న ఆమెను తిక మక పరచింది.

"ఏనాడైతే మిమ్మల్ని వీడిపొయ్యానో అనాడే బాధలకు నామనసు నిలయ మైంది. వాటికి అంతులేదు. నన్నిలా కలకాలం బాధపడమనే, మీ రానాడు నన్ను తేలిగ్గా పంపగలిగారు। నాకు తెలుసు! మీది రాతిహృదయం. పైదంతా నటన." ఆమె వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"పార్వతీ! .... నన్ను ఎవ్వరూ అర్థం చేసుకోలే దింతవరకూ! ప్రతిసారి నేనే, పార్వతీ, వోడిపోతున్నది జీవితంలోని ప్రతి ఘట్టంలోనూ-చదువులో, వివాహంలో, ఆఖరికి ఈ వయస్సులో కూడ. నాకు మిగిలిందేమీటి? బాధ! మానని గాయం! అంతే!" ఆయన గొంతు పూడుకుపోయింది.

సాయంత్రానికి మేరీకి జ్వరమొచ్చింది. అందువల్ల ప్రయాణం సాగ లేదు. పార్వతీ పోతానని బయలుదేరింది; జర్వంతో ఉన్న పిల్లతో! కానీ దుర్గయ్యగారు ఒప్పుకోలేదు।

"మీ దయకు అంతులేదా? మీ దయ అపారమై, నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎప్పుడో గిలగిలలాడి ప్రాణవాయువులు గాలిలో కలిసిపోతాయి. అప్పుడే మీకూ, నాకూ, అందరికీ శాంతి."

దుర్గయ్యగారికి ఈ పరిస్థితి చూసి బాధవేసింది. ఉన్న కాసేపూ సూటీ పోటీ మాటలతో ఒకర్నొకరు బాధించుకోవటమేనా? అందుకే ఆయన వాదన పెంచటం ఇష్టంలేక, సాధ్యమైనంత వరకూ యిల్లు వదిలి తిరిగారు.

బజార్లో కూడ పార్వతి గురించే ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఊహించివుంటే, అసలు వీధిలో కొచ్చేవాడే కాదేమో! అందరికీ, తన ఇంట్లో గల స్త్రీ గురించి, తమ యిద్దరికీ గల అనుబంధాన్ని గురించి ఆలోచనే రావటం ఆయనకు ఆశ్చర్యమేసింది.

స్వతహాగా ఆయనది శాంత స్వభావం। అందుకని అందరిముందు తప్పు చేసినట్లు తల వొంచుకోక, ఉన్న విషయం చెప్పివేశాడు.

ప్రొద్దు గ్రుంకే వేళ, మిత్రుడు రామ్మూర్తితో చెప్పాడు. "పార్వతి వచ్చిం"దని।

"నిజమా!.....విన్నాను, మీ యింటి కెవరో స్త్రీ వచ్చిందని! కాస్సేపాగి, "ఏమంటున్నది?" అని ప్రశ్నించాడు డాక్టరు రామ్మూర్తి!

"ఏ విషయాన్ని గురించి నీ వడుగుతున్నది!'' దుర్గయ్యగారి ప్రశ్నకు, రామ్మూర్తిగారు సమాధానం చెప్పలా! విషయం మారుస్తూ "ఎలా ఉంది! పూర్వంలానే ఉందా? ఆమెలో మార్పు వచ్చిందా!'' అని అడిగారు.

దుర్గయ్యగారు, బట్టతల రాచుకుని, ''రామ్మూర్తి! "వనితా విత్తం పర హస్తం గతం గతం!" అని నీకు తెలియందికాదు. పార్వతీ అంతే! పైగా మేరీ అని ఓ ఆడపిల్ల! ఆమెలో మార్పంటావా? వెలసిపోయి చిరిగిన పట్టు వస్త్రంలా ఉంది ఆమె. అంతే!"

రామ్మూర్తిగారు దుర్గయ్యగారి వేపు పరీక్షగా చూశారు. యిద్దరికీ చిరకాల స్నేహం! దుర్గయ్యగారు, వార్ధక్యమూ, బాధలో, వాటితో మనస్థయిర్యము లేకపోవటంవల్ల, మనిషి చాలావరకు క్రుంగిపొయ్యారు. కళ్లు, మొహము ఉబ్బినాయి! జుత్తు పండిపోయి రాలిపోయింది. జవసత్వాలు కరిగిపోయి నాయి ఆయనలో. పైగా, విద్యుదాఘాతంవలె పార్వతి వీడిపోవటం! అన్నీ ఆయన్ను కలచివేసి, కృశింపచేసినయ్!

''రామ్మూర్తి! ఒక విషయం ఆలోచించి సలహా ఇవ్వు! నా కష్టసుఖాలు తెలిసినవాడివి! ఈ సమయంలో నువ్వే నాకు అండ; చెప్పగలవా?'' దుర్గ య్యగారి మొహంలో, మాటలో ధ్వనించిన జాలి, ప్రార్థన విని రామ్మూర్తి గారు కరిగిపొయ్యారు.

''తప్పకుండా దుర్గ! చెప్పు.''

"పార్వతీ ఎంత చెడ్డా, నా భార్య! తెలిసో తెలియకో తప్పు చేసింది. యింత కాలానికి ఎలాగో 'యాదృచ్ఛికం'గా నా యింటికి వచ్చింది. ఆమెను చూస్తుంటే చాలా క్లిష్టస్థితిలో ఉందని అనిపిస్తున్నది. నాకూ ఎవ్వరూ లేరుగా ఆమె నిక్కడే నా కళ్ల ఎదురుగా ఉండమని అందామని ఉంది. ఆమాత్రం దయకు ఆమె అర్హురాలు కాదా! చెప్పు రామ్మూర్తి!" దుర్గయ్యగారు లేని ఆవేశంతో మాట్లాడారు. మధ్యలో ఆయన కంఠం గాద్గదికమైంది.

రామ్మూర్తికి తెలుసు; పార్వతి దుర్గయ్యగారికి ఆరో ప్రాణమని! అలా ప్రేమించారు; ప్రేమ పంచి యిచ్చారు ఆమెకు! కానీ ఓ వానరాత్రి ఆయన్ను, ఆయన సాహచర్యాన్నీ, నమ్మకాన్నీ త్రోసిపుచ్చి వెళ్లిపోయింది దుర్గయ్య గారి బహిఃప్రాణం! తిరిగి, యిన్ని సంవత్సరాలకు అయాచితంగా వచ్చింది. ఆమె పోయినా, ఆమెమీద ప్రేమ, మమకారం ఆయన్ను వదల్లేదు. నరనరాన ఆయన్ని పట్టుకు వేధించుతున్నది.

రామ్మూర్తి తన అభిప్రాయాన్ని వెంటనే చెప్పలేక పోయినాడు. "చూడు దుర్గం! తేలిగ్గా ఓ నిర్ణయానికి నే రాలేకపోతున్నా! రోజులు గడవనీ! అలోచించి చెప్తాను. పద; పార్వతిని చూద్దాం!" అన్నారు.

ఇద్దరూ వెళ్లేసరికి పార్వతి, మేరీని నిద్రపుచ్చుతోంది. రామ్మూర్తిని చూసి క్షణం నివ్వెరబోయింది. ఏదో లజ్జ ఆమెను ఆవహించింది. కొంగు నెత్తిమీదకు కప్పుకుని. వొదిగి మూలకు ఒరిగి నిలబడింది.

"బాగున్నావా?" అని ప్రశ్నించారు రామ్మూర్తిగారు. అయినా ఆమె సమాధాన మివ్వలేదు. మౌనం వారిమధ్య చోటు చేసుకుంది. దుర్గయ్య ఆ నిశ్శబ్దతను భరించలేక "అమ్మాయికి జ్వర మొచ్చింది. చూసి మందు యివ్వండి" అన్నారు.

రామ్మూర్తిగారు, మేరీని పరీక్ష చేసేప్పుడు ఆయన్ను గమనిస్తూనే ఉంది పార్వతీ సిగ్గుతో, లజ్జతో, వాలిన కళ్లతో!

"జ్వరాన్ని గూర్చి భయపడాల్సిందేమీ లేదు. మందిస్తాను. తగ్గుతుంది. అయినా యిప్పుడే అమ్మాయిని కదలించటం మంచిదిగాదు దుర్గయ్యగారూ! అన్నారు.

"ఎన్నాళ్లుండాలంటారు?"

"జ్వరం నిమ్మళించేదాకా," అని రామ్మూర్తిగారు వెళ్లారు. బరువుగా, దీర్ఘంగా నిట్టూర్చి పార్వతి "ఆయన్నిలా అర్ధాంతరంగా ఎందుకు తీసుకొచ్చారు? నా తల అవమానంతో ఎందుకు పగిలిపోదో అనిపించింది. ఏమైనా మీకు ప్రపంచంలో బ్రతకటానికి కావాల్సిన జ్ఞానం యింకా లభ్యపడలా! లేకపోతే, ఆయన ముందిలా అవమాన పరిచేవారా నన్ను! చెప్పండి" ఆమె రోషంగా చూసింది.

దుర్గయ్యగారు చలించలా! "అలాంటి భావమేం లేదు నాకు. పసిపిల్ల జ్వరంతో మూసిన కన్నెరక్కుండా ఉంది. మందిప్పించి, పిల్లకు స్వస్థత చేకూర్చాల్సిన బాధ్యతనాకుంది, నువ్వెంత కాదన్నా! అని సమాధానమిచ్చారు.

"బాధ్యతా? మీకా? చాలా ఆశ్చర్యంగా ఉందే! ఏ సంబంధమూ లేని ఓ అనాథబాలికమీద మీకెందుకు జాలి ఉండాలి?" ఆమె రెట్టించింది.

''ఏం ఉండకూడదా? పైగా ఆ బాలిక నా ఒకనాటి భార్యవల్ల ఈ లోకంలో అడుగుపెట్టింది, ఆ అనుబంధం చాలదా? అయినా నా కివ్వేమీ తెలియవు. ఆ పిల్లకు మందిప్పించాలనీ, అది నా తక్షణ కర్తవ్యమని నా అంతరాత్మ ఘోషించింది. దాన్ని శిరసావహించాను. అంతే!"

''మీ అంతరాత్మ చాలా విచిత్రమైంది బాగున్నదే? అయితే ఆ అంతరాత్మ ఆ బాలికతల్లిని కూడ ప్రేమించమని చెప్తున్నదా? పిచ్చిమీకు వదల్లేదు! అంతరాత్మ లేదు; ఏమీలేదు! మొదట్నుంచీ అదే మిమ్మల్ని అడ్డదారుల్ని లాక్కొనివెళ్లి, యిబ్బంది పెడుతోంది. ఇప్పటికైనా దాన్నుంచి, తప్పుకు రండి!"

మరి ఆయన నోరు తెరవలేదు।

ఆ రాత్రి ఆయనకు, పార్వతీ ఏడుస్తుండగా మెళకువ వచ్చింది! అంత రాత్రి ఆమె ఏడుపు విచిత్రంగా కనబడింది ఆయనకు! దీపం పెద్దది చేసి, ''పార్వతీ। ఎందుకేడుస్తున్నావో నే తెలుసుకో వచ్చా!'' అని అడిగారు।

'తెలుసుకుని, వెళ్లగొడతారా?'

''ఎంతమాట.... అంతటి దుష్టుడిగా భావిస్తున్నావా నన్ను! కానీ ఒక్క సంగతి మర్చిపోకు। నీకింకా ఆప్తుడు, నీ శ్రేయోభిలాషి, బ్రతికే వున్నానని గుర్తుంచుకో।''

దుర్గయ్యగారెళ్లి, మంచంమీద కూర్చున్నారు. కాని ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూనేవుంది। అదే ఆయనకు బాధగావుంది! చాలాసేపు నిద్రను దగ్గరికి రానీయకుండా, ఆమెను చూస్తూ కూర్చునే వున్నాడు.

ఆయనకు, అమెతో గడిపిన రోజులు స్మృతి పథంలోంచి యింకా మాసి పోలేదు. వారాలు చేసుకు చదువుకుని, పదిమంది దయా దాక్షిణ్యాల మీద బాల్యం గడిపిన ఆయనకు వివాహమైన క్రొత్త రోజుల్లో పార్వతిని చూసి, తనకూ ఓ సహచరిణి దొరికిందని, తన కష్టసుఖాలు పంచుకుంటుందనే ఆశించారు।

కానీ పార్వతి ఆయన ఆశల్ని ఎక్కువరోజులు ప్రాణంతో ఉండనివ్వలేదు. బ్రతికి చెడ్డ కుటుంబలోని ఆమెకు భర్తతో కాపురం, గార్హస్త్య జీవితం ఖైదుగా తోచింది. ఆ భావాన్ని చేతల్లో, మాటాల్లో అన్నిటా వ్యక్తీకరించ టానికి శాయశక్తులా ప్రయత్నించింది!

క్రమంగా, ఓ అగాధాన్ని ఏర్పరచుకుని ఆమె తనకూ భర్తకూ, తను దారి తప్పిన యక్షకన్య అని, అతడు తన పాలిట కింకరుడనీ తలపోసింది. అదే భావం ఆమెలో వ్రేళ్లపాతుకుని, మ్రానయి, శాఖోపశాఖలుగా విస్తరించి నది. ఏ సమయంలోనూ అతడెంత ప్రయత్నించినా, ఆమె అతనికి సన్ని హితురాలు కాలేకపోయింది. అసంతృప్తి ఆమెను పూనింది.

ఈ అర్ధరాత్రి తన తప్పిదాలను తల్చుకుని పరిహారం కొరకు విలపిస్తు న్నదా ఆమె! అనే భావం కూడ ఆయనకు కలిగింది.

"జరిగినదానికి బాధపడి ప్రయోజనం లేదుగా పార్వతీ!" అన్నారు ఆమె, శోక సముద్రం నుంచి ఒడ్డుకు వచ్చిన తర్వాత!

"జరిగిందానికి బాధ ఎప్పుడూ లేదు। భవిష్యత్తును చూస్తుంటే నా భయం

పెనుభూతమై కన్పడుతున్నది. ఎలా బ్రతకాలి! తాడు తెగిన గాలిపటం గమ్యం ఏమిటి? ఈ ముక్కుపచ్చలారని పిల్లకు ఆధార మెవ్వరు? అదే సమస్య. ఈ సమస్య తీరే మార్గం కనుచూపుమేరలో లేదు!"

దుర్గయ్యగారు ఏం సమాధానం చెప్పాలో ఆలోచిస్తూనే ఉన్నారు. తొందర పడి చేసే నిర్ణయం వల్ల కలిగే ఫలితాలను తాను ఎదుర్కోగలడా? అనే సందేహం ఆయన్ను వేధిస్తున్నది.

"అయినా ఇందులో నాది మాత్రం ఏం తప్పుంది? నన్నానాడు అలా ప్రవర్తింపజేసిన కోరికలదా తప్పు। జాలి, సహృదయత పేరుతో నా మానాన వదలి, చేతులు ముడుచుక్కూర్చున్న మీది తప్పు! అంతే నిశ్చయంగా"

ఆమె చేసిన నేరారోపణకు ఆయన ఉలిక్కిపడి ''నాదా తప్పు?'' అని ప్రశ్నించారు.

''ఆహా! మీదే! పిల్లలకు చెడునడవడి కలిగితే, ఆ తప్పు తల్లితండ్రులదేగా। అలాగే భార్యనూ। కొట్టో, నానాహింస పెట్టో, నన్ను ఆ చెడుమార్గంలోకి పోకుండా ఆపితే, ఈనాడు అనాధనై, భ్రష్టనై మీముందు, మీమీద నేరారోపణ చెయ్యాల్సిన అగత్య మేముంటుంది? మాట్లాడరేం? ఒక్క ఆడదానికి సమాధానం చెప్పలేని మీరు ఎంత సజ్జనులు, ధర్మపరులైతే ఏం లాభం?"

పార్వతి మొహం లాంతరు వెలుతుర్లో వేటలోంచి తప్పించుకున్న బెబ్బులిలా కనిపించింది దుర్గయ్యగారికి! ఈ సడింపు, అసూయ, సుస్పష్టంగాని బాధ, ఆమె పాలిపోయిన ముఖంలో వింతకాంతిని ప్రస్ఫుటం చెయ్యసాగాయి.

"అయితే నీ బాధ్యత, నీ కుమార్తె బాధ్యత, ఈ వృద్ధాప్యంలో వహించక తప్పదనేగా నీ అంతర్యం." నిశ్చయంగా అడిగారు ఆయన.

"అలా అని నే నేం ప్రాధేయపడను. ఎంతగా పతనం చెందినా, దైహిక, మానసిక, ఆర్థికంగా; మాయమాటలతో, బరువు బాధ్యత మీమీదనెట్టి చూస్తూ

కూర్చోలేను."

మరయితే ఈ ములుకుల్లాంటి భాషతో పొడిచి బాధ పెట్టటం.... కేవలం సరదా కాదుగా? ఆయనకు అర్థం కాలేదు.

అప్పుడే పార్వతి దుర్గయ్యగారింట్లోకి వచ్చి పది హేను రోజులైంది. గ్రామంలో వృద్ధుడైన దుర్గయ్యగారి రసికత్వాన్ని గురించి గుసగుసలు ప్రారంభమై, పార్వతి చెవిన సోకినయ్! ఆమె ఆ నీచపుమాటలు విని సహించలేకపోయింది.

"ఒక్క క్షణం ఈ యింట్లో ఉండను! నావల్ల మీరు లోకుల దృష్టిలో దోషిగా నిలబడటం చూసి నేను సహించలేను. మీరు నన్ను ఆపటం మీ శక్యంగాదు ఈసారి." కళ్లల్లో నీళ్ల గిరికీలు కొట్టినయ్ ఆమెలో.

దుర్గయ్యగారందుకేమీ మాట్లాడలా. మేరీని ఒడిలో కూర్చోబెట్టుకు ఆడిస్తూ ఆమె చిన్ని నోరునూ, మిలమిలా మెరిసే నేత్రాలనీ చూస్తూ కూర్చున్నాడు, మేరీ తన్ను వదలదనీ, అందువల్ల పార్వతి కాళ్లకూ సంకెళ్లు పడతాయనీ ఆయన గ్రహించగలిగారు.

"రా. వెడదాం." అని ఆయన నుండి మేరీని బలవంతంగా లాక్కోబో యింది. మేరీ, దుర్గయ్యగారిని కౌగిలించుకుని రాకపోవటం చూసి, కోపంతో రోషంతో బలవంతాన లాగి నాలుగు కొట్టింది. "పాడుదానా. నా ప్రాణానికి తగలాటక మైనావు. నాకు చావు రాదు; నీకు మిత్తి అంటనూ అంటదూ. ఇద్దరమూ కలసి ఏ బావిలోనో దూకితే సరిపోతుంది." ఆమె శోకాస్త్ర మైన గొంతుతో బావురుమన్నది, మేరీతోపాటు.

దుర్గయ్యగారి మనస్సు చివుక్కుమన్నది. తన నుంచి, ఆమె ఎందుకు తిరిగి దూరమవ్వాలని, సదా యత్నిస్తున్నదో ఆయనకు అంతుచిక్కటంలా.

తల్లీ కూతుళ్లు తమ శోకాలనుంచి బయటి కొచ్చింతర్వాత, దుర్గయ్యగారు తన నిశ్చయాన్ని వెళ్లబుచ్చారు.

చూడు పార్వతి। నీకు కష్టం కలిగిస్తే క్షమించు. నాపై కోపాన్ని అశుభమూ, శుభమూ తెలియని పసిపిల్ల మేరీమీద చూపితే నే సహించలేను. కానీ ఒక్కటి గుర్తుంచుకో। నేను బ్రతికున్నంతవరకూ నీకూ, నీ మేరీకి ఏ లోటు రాని వ్వను. ఆ తర్వాత సంగతి చెప్పలేను. రహమాన్ కూడా నా మాట జవ దాటడని నా నమ్మకం. నానుంచి ఏవిధమైన సహాయమూ నీవు పుచ్చుకోవ టానికి నీకు యిష్టము లేకపోతే నే చెప్పేదేమీ లేదు. నీకోసం ఈ యింటి తలుపు లెప్పుడూ తెరిచే ఉంటాయి. అని చెప్పారు; ఆయన దూరంగా కను పించే తాటి తోపునీ, దాని కవతలనున్న కాలువను చూస్తూ.

పార్వతి ఏం మాట్లాడలేదు ఆ తర్వాత. ఏదో చెప్పలేని కాంక్ష, మాటలు, ఆమె కళ్లల్లో తొంగిచూచేవి కొన్నాళ్లవరకూ.

కాని ఓ రాత్రి మేరీని వదలి ఎటో వెళ్లింది పార్వతి. తిరిగి రాలేదు. వస్తుందని కూడ ఎదురు చూడలేదు ఆయన ఆమెకోసం. అందువల్ల ఫలితమూ లేదని ఆయనకు తెలుసు. ఎందుకలా ఆమె చేసిందో ఆయనకు పూర్తిగా తెలియదు.

ఆ తర్వాత ఏదో స్త్రీ శవం మోటబావిలో కనుపించిందనీ, ఆ శవం పార్వతీదేనని రామ్మూర్తి గట్టిగా బలపరచగా వెళ్లి యిద్దరూ చూచారు. పూర్తిగా గుర్తుపట్టటం సాధ్యపడలేదు. కాని ఆ శవం ఆమెదేనని రామ్మూర్తి ఎంత వాదించినా, ఆమె అంత పిరికిది కాదని దుర్గయ్యగారి ఆత్మ విశ్వాసం,

ఏదేమైనా ఆమె తిరిగి రాలేదు.

ఆ రోజునుంచీ దుర్గయ్యగారికి క్రొత్త బాధ్యత పడింది మేరీకి సంరక్షణ

చేయటం ఆయన దినచర్యలో స్థానం ఆక్రమించుకుంది. అందుకు ఆయన ఏమీ బాధపడలేదు. తప్పుకోవాలని దానినుంచి ప్రయత్నమూ చెయ్యలేదు.

వచ్చీరాని మాటలు వింటూ మేరీ నుండి ఆనందాన్ని లభ్యపరుచుకోవడానికి ఆయన కృషిచేస్తూ తల్లిలేని లోటును తీర్చటానికి ప్రయత్నం చెయ్యసాగారు, ఆయన కదేమీ క్రొత్త కాదు.

సరిగ్గా కొన్నేళ్ల క్రితం!

తల్లిలేని, రహమాన్, యొక్క బాధ్యత స్వీకరించి యింతవరకూ దానిని నిర్వహించాడు. ఈరోజుకి రహమాన్ యుక్తవయస్కుడైనాడు. తన ఈ వృద్ధాప్యంలో అతడు చేదోడుగా ఉంటాడని ఆశించాడు. నిశ్చింతగా బ్రతుకవచ్చని భావించాడు.

కానీ మేరీని సాకీ, ఈ లోకంలో గౌరవనీయ కుటుంబాలలో చేర్చవలసిన కర్తవ్యం తను నెరవేర్చగలననీ, మేరీ భవిష్యత్తు తన చేతుల్లో సక్రమంగా రూపుదిద్దుకో గలదనీ, పార్వతి తలంచటం వల్ల దుర్గయ్యగారు ఆ బాధ్యతనూ సంతోషంగా స్వీకరించాడు.

రామ్మూర్తి రోజూవచ్చి పల్కరించి పోతున్నాడు. రోజులు సాఫీగా సాగుతున్నయ్. మేరీ ఆరోగ్యంగా పెరగసాగింది. అమెను చూస్తూ జీవితంలో చివరి క్షణాలు గడుపసాగారు దుర్గయ్యగారు.

ఈ రోజు,

రహమాన్ దగ్గర నుండి సుదీర్ఘమయిన లేఖ వచ్చింది దుర్గయ్య గారికి. ఆసాంతం చదివి ఆయన బాధపడ్డారు. సాయంత్రం ఆప్తమిత్రుడు రామ్మూర్తి రాగానే ఉత్తరం తీసి చేతికిచ్చి చదవమన్నారు.

రామ్మూర్తిగారు చదివారు. ''ఇలా జరుగుతుందని తెలుసు. పరాయివాళ్లై

ప్పుడూ పరాయివాళ్లే! నీవాళ్లు కాదు'' అని అన్నారు.

''నిజమే అవొచ్చు. అంతమాత్రాన మన కర్తవ్యాన్ని నిర్వర్తించటంలో తప్పు లేదుగా! ప్రతిఫలాపేక్ష లేకుండా చెయ్యటమే మనవంతు.''

''చూడు దుర్గం! మనదీ అనుకుంటే అన్నీ మనవే! కాదనుకుంటే కావు. నీ కులం, మతంకాని, బంధువుకూడ కాని, రహమాన్ బాధ్యత వహించావు. జరిగిందేమిటి? నిష్కల్మషమైన నీ జీవితానికి కళంకం ఆరోపించాడు. ఇది చాలదూ! ఇంతకన్నా జరగాల్సిందేమిటి? ఆలోచించుకో. రేపు మేరీ అయినా అంతే! రెక్కలొచ్చేంతవరకే మనం. ఆతర్వాత మనతో వాళ్లకు అవసరమే లేదు. ఎవరి దారి వారిదే." దుర్గయ్యగారి భుజం తట్టి "నీ మనస్సు నేమీ బాధ పెట్టుకోకు. ఇప్పటికైనా నిజానిజాలు రహమాన్‌కు తెలియచెయ్యి. మంచుతెరలు తొలగించు. అదే అందరికీ క్షేమం." అని చెప్పారు.

ఆ తర్వాత దుర్గయ్యగారు దీర్ఘంగా ఆలోచించుకున్నారు. కలం అందుకుని వ్రాయసాగారు.

"చిరంజీవీ,

సరిగ్గా ఇరవయేళ్ల క్రితం ఓ సాయంత్రం, కొన్ని రోజుల క్రితం ఆ ఊరి—పేరు తెలుసుకోవటంవల్ల ఉపయోగంలేదు—హైస్కూలుకు వేరొక ప్రదేశమునుండి బదలీ అయి వచ్చా. స్కూలు వదిలిన తరువాత ఇంటికెళ్లే ప్రయత్నంలో ఉన్నా. ఓ కుర్రవాడు స్టాఫ్‌రూం కొచ్చి నన్ను రజియా బేగం, తమ యింటికి అర్జంటుగా రమ్మని కబురు చెప్పి పంపింది. సహ—ఉపాధ్యాయుడు జేసురత్నం వెకిలిగా నవ్వి "వెళ్లండి! మీ పంట పండింది! అని కన్నుగీటి వెళ్లాడు.

కానీ నేను అంతగా అతడి వ్యాఖ్యానాన్ని పట్టించుకోలా! ఆ కుర్రవాడెంబడి నడచి, ఊరికి దూరంగా ఉన్న మామిడితోటలో ఉన్న బంగాళాకి

వెళ్లాను. అదే ప్రథమం నా జీవితంలో అంత అందమైన బంగళాను చూడటం. సుందరమైన తైలవర్ణ చిత్రాలు, చిత్రకళా వైభవంతో చిత్ర వీగే రకరకాల పరికరాలు ఆశ్చర్యంతో చూస్తూ, ఒంటరిగా సోఫాలో కూర్చుని త్వరగా ఇంటికి వెళ్లి పార్వతి సన్నిధానంలో కాలం గడపాలనీ, అందమైన సాయంత్రం త్వరగా పోతున్నదని విచారిస్తూ కాలం గడప సాగాను.

ద్వారానికి ఉన్న పల్చటి తెరను తొలిగించుకుని బలిష్ఠుడైన వస్తాదు వెనుక మేలి ముసుగు ధరించి రజియాబేగం వచ్చింది.

నేను రెండు మూడు సార్లు కంటె ఎక్కువ చూడలేదు ఆమెను. కొందరు మహమ్మదీయ స్త్రీలు పరాయి పురుషుని సమక్షంలోకి రారని నాకు తెలుసు. కానీ రజీయాబేగం వచ్చింది. అప్పుడామె చాలా చిన్న వయస్సులోనే ఉంది. ఆమె ముఖములో విచారరేఖా ఉంది.

అసలు విషయం చెప్పలేదుకదూ। ఆమె కుమార్తె చాంద్‌బీకు తెలుగూ, లెక్కలూ చెప్పాలని ఆమె కోరింది. అదీ ఆ బంగళాకు రోజూ వచ్చి చెప్పాలనీ—ప్రతి సాయంత్రమూ!

నేను ఏ విషయమూ చెప్పలేదు. తక్షణం మర్రోజు నా నిర్ణయం చెబుతానని వచ్చేశాను. ఆ రాత్రి పార్వతితో ఆ విషయం కదిపాను. పార్వతంటే నా భార్య! ఆమె వెలిబుచ్చిన సందేహాలు—అంతమంది ఉపాధ్యాయు లుండగా నన్నే ఎందుకు ఆ చాంద్‌బీకి ట్యూషను చెప్పటానికి పిలిపించాలి? ఇందులో ఏదో రహస్యముందని అభ్యంతర పరిచింది.

ఆ రోజుల్లో పార్వతి మాట, గీచిన గీటు దాటేవాణ్ణిగాదు. మరో ఆలోచన లేకుండా ఆ ప్రసక్తి విరమించుకున్నా. జేసురత్నం రోజూ నన్ను వేదిం

చుకునేవాడు. "వెళ్ల భాయి. లక్కీచాన్స్. పోతేరాదు. మరీ ప్రవరాఖ్యుడవైతే ఎలా! వ్రాత వలచి తనంతట పిలిపించింది" అనేవాడు. నేనంతగా పట్టించుకోలా అతని మాటలు.

ఓరోజు హెడ్‌మాస్టరు పిలిచి "నువ్వు రజియాబేగం కుమార్తెకు ప్రవేటు చెప్పాలి. నీ పేరు వాళ్లకు తెలియజేసింది నేనే. ఇతరులు చెప్పింది నమ్మకు. ఎదటి వాళ్ల బాగు ఓర్వలేరు. ఈరోజేవెళ్లి ట్యూషన్ ప్రారంభించు." అనిచెప్పారు.

వెళ్లి ఆరోజే చాంద్‌బీకి ట్యూషన్ చెపటం ప్రారంభించా. మరో ఆలోచన మనసులోకి రానియ్యలేదు. మొదటిరోజు కొన్ని పళ్లు, 50 రు. డబ్బు కానుకగా యిచ్చారు. ఆ డబ్బు చూచి, పార్వతి మొహం పున్నమిచంద్రుడంత అయింది.

క్రమంగా వాళ్లను గురించి సమాచారం తెలుసుకోగలిగా. వాళ్ల యింట్లో ఉండే వస్తాదు నాకా సంగతులన్నీ చెప్పాడు. రజియాబేగం–తండ్రి చాలా భాగ్యవంతుడట. రజియా–భర్త హిందువు. ఇద్దరూ ప్రేమించుకుని పెండ్లి చేసుకున్నారు. అయితే ఎవరూ తమ ఆచారాలు, మతాలు మార్చుకోలేదు. అంత అవసరమూ రాలేదు. బలమైన వారి ప్రేమ. సామాన్య సంకుచిత అవధులు దాటి పవిత్రంగా నిలువగలిగింది.

నవకాళీ దురంతాలు ఎందుకు ఎలా జరిగాయో కనీసం విన్నైనా ఉంటావు. అదే సమయంలో రజియా–భర్త రాంసింగ్ దారుణంగా చిత్రవధ చేయబడ్డాడు. అల్లుడిని రక్షించుకోవాలని రజియా తండ్రి వృధా ప్రయత్నంచేసి, ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

చాంద్‌బీతో, నమ్మకస్తుడైన వస్తాదుతో స్వదేశం వదలి ఈ దూర ప్రాంతాలకు ఆమె వచ్చేసింది; తెచ్చుకోగలిగినంత ధనము, సంపద తెచ్చు

కుని. కొన్నాళ్లకు ఓ మగశిశువును కూడ కన్నది. అదీ రజియా పూర్వ చరిత్ర.

చాంద్‌బీ చాలా తెలివిగలది! అందువల్ల నాకాట్టే శ్రమ ఉండేదికాదు. నామీద చెడు ప్రచారం గ్రామంలో జరుగుతోందని, దానికి జేసురత్నం నాయకుడనీ తెలిసింది. ఎన్నోసార్లు నా ప్రాణం తీశాడు జేసురత్నం ఆయింటి అనుపానులు చెప్పమని. ఆ పనే నే చెయ్యలేదు.

కానీ మొదలుపెట్టిన పనిని, మధ్యలో వదిలెయ్యటం నాకు చేతగాని పని!

క్రమంగా రోజులు గడుస్తున్నయ్. రెండురోజులు గాలివాన, నేనెక్కడికీ వెళ్లలేదు. ఆరోజు కనుచీకటివేళ రొజుకుంటూ వస్తాదు మా యింటికొచ్చాడు. కళ్లు జ్యోతుల్లా వెలుగుతున్నాయ్. నన్నుచూసి బావురుమన్నాడు. నాకర్థం కాలేదు. నేను అతడి వెంటనే ఆ చీకటిలో వానలో రజియాబంగళాకు వెళ్లాను.

తోటంతా గాలివానకు పాడుబడిన ఆలయంగా ఉంది. సరాసరి హాల్లోకి వెళ్లేసరికి, పోలీసు ఇన్‌స్పెక్టరు, ఊరి పెద్దమనుష్యులు, ఇంకా ఇతరులు ఉన్నారు.

రజియా తన ఆస్తినంతా ఏకైక శిశువుకు వ్రాసేసి కుమార్తెతో సహా ఆత్మహత్య చేసుకుంది. అంతకన్నా యింకేం చెప్పలేను. ఆ తరువాత కేసులూ, పంచాయితీలు నడిచినయ్. వస్తాదు ఆ ఊరినుంచి వెళ్లిపోయాడు.

ఆ వాన రాత్రి ఆ శిశువును తెచ్చి పార్వతికి అప్పజెప్పా. కొన్నిదినాల పరిచయంతో ఆమె నాయందు నిల్పిన విశ్వాసాన్ని ఎంతవరకు సక్రమంగా నిర్వర్తించానో తెలియదు!

రజియా ఆస్తికి నేను ట్రస్టీ అయ్యేసరికి ఊళ్లో నాకు పరపతి పెరిగింది. పార్వతికీ—నాకు అభిప్రాయభేదాలు కలిగాయి. ఆమె బ్రతికిచెడ్డ యింటి

ఆశపడుచు. కోరికలు నాగుపాములై ఆమెను కాటు వేసినయ్. రోజురోజుకూ మా మధ్య స్పర్థ పెరిగింది.

"చూడండి! వీడా పసి వెధవ! ఏ జబ్బో వచ్చి వీడు గుటుక్కుమంటే ఆ ఆస్తి మనదే! అయినా చూడండి. మనం ఎంతకాలం ఇలా ఉండికీ, గుడ్డకీ మొహంవాచి బ్రతుకుదాం చెప్పండి. మంచీ, చెడు తర్వాత! ఆ ఆస్తి మీద ఆదాయం వాడుకుంటే ఇంతలో ఏంగాదు" ఇది ఆమె ధోరణి.

స్థిరసంకల్పుడనై, ఆ పవిత్రమైన కార్యాన్ని నిర్వహించాను. ఆ ధర్మ దీక్షలో నా భార్య ఇలా తిడుగుతున్నా, నా గమ్యాన్ని మానుకోలేదు. నా భార్య పార్వతి తీరని కోరికలతో తన జీవితాన్ని వీధిలో పారేసుకుని తిరుగుతూ 'యాదృచ్ఛికంగా' నా యింటికి వచ్చి నాకు ఈ వయస్సులో మేరీని అప్పచెప్పి వెళ్ళిపోయింది. ఇందులో దాపరికం ఏమీలేదు. నీ ఆస్తిని అపహరించాలని తలంపే ఉంటే నిన్ను ఏనాడో ఈ లోకానికి దూరం చేసేవాడిని. నిన్ను చిన్నప్పట్నుంచీ బోర్డింగ్, లాడ్జింగ్ స్కూల్లో ఉంచి, చదివించి, నీ ఆస్తిని ఇంత భద్రంగా కాపాడేవాడినే కానేమో! కానీ నీ ఉత్తరంలో నీవు చేసింది అసత్యారోపణ అయినా నా మనసు బాధపడక తప్పలేదు.

పోతే, చాంద్‌బీ సంగతి వ్రాయటం మర్చిపోయాను. ఆ రోజు రజియా బేగం, ఆత్మహత్య చేసుకున్న రాత్రి.... చాంద్‌బీ తల్లిని వెతుకుతూ దొడ్లో ఉన్న మోటబావి దగ్గరకు వెళ్ళింది. తల్లి శవం, నీటిలో తేలుతూ ఉంది. ఆ పదేండ్ల చాంద్‌బీ, కర్తవ్యతా విమూఢయై, పెద్దగా కేకవేసి, వెనుతిరగబోతూ కాలుజారి నీటిలో పడిపోయింది. వస్తాదు వచ్చి యిద్దరినీ వెలికితీసే సరికే ఆ తల్లీ, పిల్ల ఈ లోకాన్ని వీడిపోయారు. ఇవన్నీ నాకెలా తెలిసినయ్ అని నీవు అనుమానపడొచ్చు. వస్తాద్ ఇప్పుడు జేసురత్నాన్ని హత్య చెయ్యబోయి దొరికిపోయి జైల్లో పడ్డాడు. అప్పుడే చెప్పాడు ఈసంగతి;

రజియాబేగం చావుకు—జేసురత్నానికీ సంబంధం ఉందని.

ఇంతకన్నా నీకు చెప్పాల్సిందేమీ లేదు. ఇన్నాళ్ల నుంచీ భద్రపరచుకున్న ఈ రహస్యాన్ని, అవసరమొచ్చి నీకు తెలియచేస్తున్నా. నీ తండ్రి దుర్గయ్య జీవితంలో కొన్ని ఘట్టాలే యివి. నీమెంతో నాకు.... మేరీ అంతే! ఈ ఉత్తరం చదివిన తరువాత, ఈ మాట కాదనలేవని నాకు తెలుసు.

ఎక్కడున్నా నీ మంచే కోరే,
దుర్గయ్య.

ఉత్తరం ముగించేసరికి వాన వెలసింది. దుర్గయ్యగారి మనస్సు తేలిక పడ్డది. నిద్రపోయే మేరీని చూస్తూ, భవిష్యత్తు గూర్చి ఆలోచనలో పడిపోయారు దుర్గయ్యగారు ఆ వాన వెలసినరాత్రి. ✶

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక 8—2—63)